నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఈఎస్‌ఐ, బేగంపేట్, మైత్రీవనం సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్యామలకుంట పార్కు, బీకేగూడ, మున్సిపల్ పార్క్, ఈఎస్‌ఐ వెనుక ప్రాంతం, ఎస్ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్ లేన్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, చైతన్య జూనియర్ కాలేజ్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్.
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదిత్య బ్లాక్, ఆదిత్య వింధ్య బ్లాక్, కుమ్మరిబస్తీ, ఇమ్రోజ్ హోటల్ లేన్, ఆనంద్‌బజార్ లేన్, జీన్స్ కార్నర్, కాకతీయ మెస్, డెల్టా చాంబర్స్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

హకీంపేట, మారేడుపల్లి పరిధిలో..

కంటోన్మెంట్: ఫీడర్ల మరమ్మతు, చెట్ల కొమ్మల నరికివేత కారణాలతో సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హకీంపేట, మారేడుపల్లి ఫీడర్ల పరిధిలోని తుర్కపల్లి, మా సంతోషీ కాలనీ, కలాసీ గూడ, రాధా సత్సంగ్, సత్సంగ్, బ్లూ బర్డ్స్ కాలనీ, రైల్వే కాలనీ రామసర్ కేఫ్, సికింద్రాబాద్ నర్సింగ్‌హోమ్ లేన్ ప్రాంతాలు.
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు ఆర్‌పీ నిలయం, అడ్డగుట్ట ఫీడర్ల పరిధిలోని అల్వాల్, టెంపుల్ అల్వాల్, పాలిటెక్నిక్ కాలేజ్ లేన్, ముస్లిం గ్రేవీ యార్డ్, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

క్లాక్ టవర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

రాంగోపాల్‌పేట్: క్లాక్ టవర్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ప్యారడైజ్ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు సెయింట్ మేరీస్ ఫీడర్ పరిధిలోని సెయింట్ మేరీస్ చర్చి రోడ్, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంగీత్ ఫీడర్ పరిధిలోని బసేరా హోటల్, ఐసీఐసీఐ బ్యాంక్, సెయింట్ మేరీస్ చర్చి, సెయింట్ ఆన్స్ స్కూల్, ఐబీపీ పెట్రోల్‌బంక్, సీఎస్‌ఐ చర్చి, మాధవ నర్సింగ్ హోం ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రైల్వే రిజర్వేషన్ ఫీడర్ పరిధిలోని పాస్‌పోర్ట్ ఆఫీస్, శ్రీ సాయిగణేష్ లాడ్జీ, రెతిఫైల్ బస్టాండ్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు స్టేషన్ రోడ్ ఫీడర్ పరిధిలోని శ్రీనిధి, జనత హెచ్‌పీ పెట్రోల్ బంకు, సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్, రెజిమెంటల్‌బజార్ ప్రాంతాలు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మినర్వా, ఆర్పీరోడ్ ఫీడర్ల పరిధిలోని కళానికేతన్, కళాసీగూడ, ఎస్డీరోడ్, స్వప్నలోక్ కాంప్లెక్స్, మంజు థియేటర్, ఆర్పీరోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 40, పందిరి బీర 45, క్యాబేజీ 19, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 27, గోకరకాయ 53, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 65, మొరంగడ్డ 23, కందగడ్డ 53, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 13, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: వివిధ ప్రాంతాల్లోని కొన్ని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకుల కారణంగా భ్రూణ హత్యలు జరుగుతున్నాయని యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మమత పేర్కొన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ, విద్యతో పాటు వారికి హక్కులు కల్పించడం, సామాజిక ఎదుగుదల కోసం ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న పోషకాహారం, బాల్య వివాహాలు, రక్షణ తదితర సమస్యలపై నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు షద్రక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుమతి, మౌనిక, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

లాలాపేట: సుపరిపాలన గురించి రామాయణం, మహాభారతంలో ప్రస్థావన ఉందని తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాలకు చెందిన రిటైర్డు అసోసియేట్ ప్రొఫెసర్ పి. మోహన్‌రావు పేర్కొన్నారు. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో సుపరిపాలనకు సంబంధించి వివరించారన్నారు. మంగళవారం సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో చాణక్య ఫోరం గుడ్ గవర్నెన్స్ డే సందర్భంగా గుడ్ గవర్నెన్స్ ఇన్షియేటీవ్ ఇండియా అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు హాజరై ప్రసంగించారు. ప్రజలను పాలనలో భాగస్వామ్యం చేయాలన్నారు. పరిపాలన పారదర్శకంగా జరగడంతో పాటు ప్రాథమిక హక్కులు పరిరక్షించబడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుడ్ గవర్నెన్స్‌పై నిర్వహించిన క్విజ్ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాలన శాస్త్రం హెడ్ రూపాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ నెమలి



నెమలిని అధికారులకు అప్పగిస్తున్న దృశ్యం

లాలాపేట: వీధి కుక్కల దాడి లో నెమలి గాయపడిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఓయూ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నెమలికి ప్రాథమిక చికిత్స చేయించి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.

శ్రీరాముడి ఊరేగింపు



లాలాపేట: అయోధ్యలో భవ్య మందిరం ప్రారంభోత్సవం, రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం లాలాపేటలో బీజేపీ నాయకులు సుక్క గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లో శ్రీరాముడి పట్టాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం లాలాపేట పుర వీధుల్లో శ్రీరాముడిని పల్లకీపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, మహేష్, నవీన్ పాల్గొన్నారు.



ఉండలు చుడుతుందిలా..





ప్రెస్సింగ్ అయి మెషిన్ లోపలికి వెళ్లి తయారై వస్తున్న రోటీలు

గంటలో 1000 స్వచ్ఛమైన చపాతీలు తయారీ


- 'గాంధీ డైట్ కిచెన్'లో అధునాతన రోటీ మేకర్
- తెలుగురాష్ట్రాల్లోని ప్రభుత్వ డైట్ కిచెన్లలో ఇదే ప్రథమం
- సమయం ఆదా అంటున్న నిర్వాహకులు

ఇన్ఫెక్షన్ ఫ్రీ రోటీ @ గాంధీ

గాంధీఆస్పత్రి : సాధారణంగా వెయ్యి రోటీలు (రొట్టెలు) తయారు చేయాలంటే కనీసం ఐదుగురు మనుషులు కలిసి దాదాపుగా ఐదు గంటలు కష్టపడాలి. పిండి కలపాలి, ఉండలు చుట్టాలి, ప్రెస్సింగ్ చేయాలి, పెనంపై కాల్చాలి. ఎవరి సహాయం లేకుండానే గంట సమయంలో వెయ్యి రోటీలు తయారు చేయగలిగితే అబ్బో అదో అద్భుతం అంటాం. పిండి కలపడం నుంచి రోటీ తయారు చేసే వరకు అన్ని పనులు మెషినే చేసుకుంటుంది. అలాంటిఅత్యాధునిక రోటీ మేకర్ మెషిన్ సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డైట్ కిచెన్‌లో ఇటీవల అందుబాటులోకి వచ్చింది. వివిధ రుగ్మతలతో చికిత్సలు పొందుతున్న రోగులకు మరింత ఆరోగ్యవంతమైన, స్వచ్ఛమైన రోటీలు అందించేందుకు సంబంధిత అధికారుల సూచన మేరకు గాంధీ డైట్ కాంట్రాక్టు నిర్వాహకుడు, శ్రీ వెంకటేశ్వర అసోషియేషన్ అధినేత రవికుమార్ లక్షలాది రూపాయలు వెచ్చించి రోటీ మేకర్ మెషిన్‌ను గుజరాత్ నుంచి తెప్పించారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల డైట్ క్యాంటీన్లలో ఇలాంటి రోటీ మేకర్ మెషిన్ ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని గాంధీ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ డైట్ కిచెన్లలో ఏర్పాటుకు సన్నాహాలు

తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల డైట్ కిచెన్లలో ఇలాంటి రోటీ మేకర్ మెషిన్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చేతితో తయారు చేస్తే సిబ్బంది చేతులు, శరీరానికి అంటుకుని ఉండే పలు రకాల బ్యాక్టీరియా, వైరస్‌తో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఇన్ఫెక్షన్లు కలిగే అవకాశం ఉందని, రోటీ మేకర్‌తో ఇన్ఫెక్షన్‌లను నివారించవచ్చని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, చీఫ్ డైటీషియన్ డాక్టర్ రమేష్ తెలిపారు. ఆరోగ్యవంతమైన, రుచికరమైన, స్వచ్ఛమైన రోటీలు నిరుపేద రోగులకు అందించే అవకాశం రోటీమేకర్ ద్వారా కలుగుతుందని, మెషిన్ పర్యవేక్షణకు ఒక్కరు సరిపోతారని వివరించారు.



పిండి కలుపుతున్న మెషిన్

పనితీరు ఇలా..

పిండి కలపడం: ఈ మెషిన్ పది కిలోల గోధుమ పిండిని నిమిషాల వ్యవధిలో సమపాళ్లలో కలుపుతుంది.

ఉండలు చుట్టడం: కలిపిన పిండి ముద్దను ఈ మెషిన్‌లో వేస్తే అనుకున్న సమయాని కన్నా ముందే ఉండలుగా చుట్టి కటింగ్ చేస్తోంది.

ప్రెస్సింగ్ చేయడం: చుట్టిన ఉండలను ఈ మెషిన్ ప్రెస్సింగ్ చేస్తుంది.. మీటరు దూరం వరకు ట్రాలీపై మెషిన్ లోపల భాగంలోకి చేరుతుంది.

కాల్చడం: మెషిన్ లోపల భాగంలో ఏర్పాటు చేసిన సన్నని మంటపై రోటీని కాల్చుతుంది. కాలిన రోటీ సన్నని మార్గం నుంచి బయటకు వచ్చి అక్కడ ఉన్న ప్లేట్‌లో పడుతాయి.

మహీంద్రా- లాట్రోబ్ యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

సనత్‌నగర్: మహీంద్రా యూనివర్సిటీ, లాట్రోబ్ యూనివర్సిటీల మధ్య విద్యా సంబంధ ఒప్పందాలు భారత్–ఆస్ట్రేలియా మధ్య విద్యావకాశాలను మరింత మెరుగుపరుస్తాయని సౌత్ ఏషియా కమర్షియల్, సీనియర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ డాక్టర్ మోనికా కెన్నెడీ అభిప్రాయపడ్డారు. సివిల్ ఇంజనీరింగ్ విద్య, పరిశోధనలను విస్తృతం చేసే దిశగా ఆస్ట్రేలియాలోని లాట్రోబ్ విశ్వవిద్యాలయంతో మహీంద్రా విశ్వ విద్యాలయం ఒప్పందం కుదుర్చుకుంది. బేగంపేట తాజ్ వివంతా హోటల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇరు యూనివర్సిటీల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నాయి. ఈ సందర్భంగా వర్చువల్‌గా హాజరైన మోనికా కన్నెడీ మాట్లాడుతూ.. భారత్–ఆస్ట్రేలియాల మధ్య ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఇరు దేశాల మధ్య విద్య, సాంస్కృతిక సంబంధాలను పెంపొందింపజేయగలదన్నారు. ముఖ్యంగా పరిశోధనలపై పరస్పర సహకారం బలపడుతుందన్నారు. మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేదురి మాట్లాడుతూ.. పరిశోధన, ఆవిష్కరణ రంగంలో భావినాయకులను పెంపొందించే దిశగా ఎంఓయూ మైలురాయిగా నిలువగలదన్నారు. లాట్రోబ్ యూనివర్సిటీ అందించే బ్యాచిలర్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ (ఆనర్) ప్రోగ్రామ్ ఇంజనీర్స్ ఆస్ట్రేలియాచే గుర్తింపు పొందిందన్నారు. లాట్రోబ్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ హోస్సామ్ అబుయెల్ నాగా మాట్లాడుతూ.. రెండు యూనివర్సిటీల భాగస్వామ్యం అద్భుతమైన అవకాశాలకు తెరతీస్తోందన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఎస్ఎస్ఆర్ విజయం



విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న నిర్వాహకులు

పద్మారావునగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మారావునగర్ అభినవ్‌నగర్ యూత్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్‌జోన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో చిలకలగూడకు చెందిన సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ (ఎస్ఎస్ఆర్) జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో సికింద్రాబాద్ షటిల్ రైడర్స్, అభినవ్‌నగర్ యూత్ అసోషియేషన్, సికింద్రాబాద్ రాకెట్ రైడర్స్, పద్మారావునగర్ పార్క్ షటిల్ రైడర్స్‌కు చెందిన 22 జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో ఎస్ఎస్ఆర్‌కు చెందిన రెండు జట్లు ఫైనల్‌కు చేరాయి. మంగళవారం జరిగిన ఫైనల్‌లో (రాంబాబు, శ్రీనివాస్ జోడీ) (జితేంద్ర, స్వామి)లపై విజయం సాధించాయి. అభినవ్‌నగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్ దేశ్‌పాండే, ఎస్‌వీ రెడ్డి, మాజీ అధ్యక్షులు రాజేష్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు షీల్డ్‌లు అందించారు. రాకెట్ రైడర్స్‌కు చెందిన ఇ. చంద్రశేఖర్ బెస్ట్ ప్లేయర్ అవార్డు గెలుచుకున్నారు. రిఫరీలుగా సుధీర్, కృష్ణయాదవ్, మోహన్‌రంగా, మధుసూధన్ రెడ్డి వ్యవహరించారు.

ట్రాఫిక్ నిబంధనలతో రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చు

చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

చిలకలగూడ: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని మెట్టుగూడ జంక్షన్ వద్ద మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో పాదచారులే అధికంగా మరణిస్తున్నారని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డును దాటడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పలు సర్వేలు వెల్లడించాయని వివరించారు. రోడ్లను క్రాస్ చేసేందుకు జీబ్రా క్రాసింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, మెట్రో ఎలివేటర్‌లను వినియోగించాలని సూచించారు. కాలనీలు, బస్తీలు, పాఠశాలలు, కళాశాలల వద్ద ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



తార్నాకలో అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు

నల్లకుంట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో..

లాలాపేట: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నల్లకుంట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో తార్నాకలోని మెట్రో స్టేషన్ వద్ద పాదచారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో అధికంగా పాదచారులవే అని ముఖ్యంగా యువత రోడ్డుపై నడిచి వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నిరంజన్, ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది కుమారస్వామి, రమణయ్య, మల్లికార్జున్, వంశీ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసులు

సంతకాల సేకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా ఓయూలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలుగు శాఖ హెడ్ ప్రొ.కాశీం ముఖ్య అతిథిగా హాజరై సంతకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, అధ్యక్షులు మణికంఠరెడ్డి, విద్యార్థి నేతలు నరేష్, క్రాంతి, నెల్లి సత్య, రెహమాన్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన కాంబ్లి కోటి(53) ఈ నెల 22న రాత్రి 7 గంటల సమయంలో సీతాఫల్‌మండి బీ–క్యాబిన్–లాలాగూడ రైల్వే స్టేషన్ల మధ్యనున్న స్టీల్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన రైలు ఇంజిన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

పట్టాలపై వెళ్తుండగా..



మృతి చెందిన శ్రీకాంత్

అడ్డగుట్ట: రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బిదర్‌కు చెందిన శ్రీకాంత్(25) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కూలీగా చేస్తుంటాడు. మద్యానికి బానిసైన శ్రీకాంత్ కొంతకాలంగా పనికి వెళ్లడం లేదు. మంగళవారం సికింద్రాబాద్–జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ల మార్గ మధ్యలోని పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు.

బస్సెక్కిన విద్యార్థి అదృశ్యం



మహేష్ కుమార్

రాంగోపాల్‌పేట్: బంధువుల ఇంటికి తల్లితో పాటు బస్సులో ప్రయాణిస్తూ ఓ డిగ్రీ విద్యార్థి అదృశ్యమైన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కిషన్ యాదవ్ వివరాల ప్రకారం.. సెకండ్ బజార్‌కు చెందిన భాగ్యలక్ష్మి కుమారుడు మహేష్ కుమార్ (19) డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 19న కుమారుడితో కలిసి భూదేవినగర్‌లో బంధువుల ఇంటికి వెళ్లేందుకు 31 బస్టాప్ వద్ద రూట్ నంబర్ 23–బీ బస్సు ఎక్కారు. తల్లి ముందు సీటులో కూర్చోగా కుమారుడు వెనుక కూర్చున్నాడు. భూదేవినగర్ వచ్చాక బస్సు దిగాలని కుమారుడిని తల్లి కోరగా అతను కనిపించలేదు. చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు బంధువులు, తెలిసిన వారితో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు డీడీసీఓపీ స్నాతకోత్సవం

నల్లకుంట: విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ (డీడీసీఓపీ) కళాశాల 20వ గ్రాడ్యుయేషన్‌డే (స్నాతకోత్సవం) గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని డీడీసీఓపీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఛాయ నందిని ఓ ప్రకటనలో తెలిపారు. విద్యానగర్ ఓయూరోడ్డులోని దుర్గాబాయిదేశ్‌ముఖ్ ఆస్పత్రి రీసెర్చ్‌సెంటర్ (డీడీహెచ్ఆర్‌సీ) ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి ఏపీ విశ్రాంత చీఫ్ సెక్రటరీ డాక్టర్ మోహన్‌కంద, అతిథులుగా డీఎంఎస్ అధ్యక్షురాలు ఎస్.ఉషారెడ్డి, విశ్రాంత ఐఏఎస్‌లు చక్రపాణి, ఐవైఆర్. కృష్ణారావు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీలో పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేస్తారని వివరించారు.



నేతాజీకి నివాళులు అర్పిస్తున్న బండారు దత్తాత్రేయ

నేతాజీ.. యువతకు స్ఫూర్తి

రాంగోపాల్‌పేట్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు స్ఫూర్తి అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే ఆయన విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, పలువురు నాయకులతో కలిసి బండారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. నాకు రక్తం ఇవ్వండి మీకు స్వేచ్ఛనిస్తాను అని నేతాజీ పిలుపునిచ్చి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పాత్రను దేశ ప్రజలు ఎప్పటికి మరచిపోరని కొనియాడారు. శ్యాంసుందర్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, నరేష్, పెద్ది రవీందర్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న పోలీసులు, నాయకులు

నేతాజీ నగర్‌లో..

కంటోన్మెంట్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితం యువతకు ఆదర్శమని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకుని కంటోన్మెంట్ ఒకటో వార్డు నేతాజీ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్థానికులతో కలిసి నేతాజీ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, నర్సింగ్, నాగరాజు, సుదర్శన్, రమేశ్, కృష్ణ, శ్రీనివాస్, రామకృష్ణ, ముఖ్తార్, నవీన్, విజయ్, రాజు, అనిల్, సబిత, పద్మ, అంబిక, మేరీ పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలోచంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట..

ఉస్మానియా యూనివర్సిటీ: యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ హకీమ్ నవీద్ అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. నేతాజీ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, కేంద్రం దేశ్‌ప్రేమ్ దివస్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రోహిత్, ముబీన్, అరవింద్, మనోజ్, నితిన్ పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న హకీమ్ నవీద్

30న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

నల్లకుంట: శ్రీ సరస్వతీ సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 30న శ్రీ త్యాగరాజస్వామి 176వ ఆరాధన ఉత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 68వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంగీత విద్యాలయం అధ్యాపకురాలు యశస్విని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలోని ధ్యానమందిరంలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా టీవీ దర్శక, నిర్మాత శోభాశంకర్ హాజరవుతారన్నారు. సంగీత విద్యాలయం విద్యార్థులు, సంగీతాభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సాక్షి కథనం.. స్పందించిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

లాలాపేట: నిజాం కాలం నాటి నిర్మాణంపై ఏపుగా పెరిగిన వృక్షంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యపై ఈ నెల 21న సాక్షిలో 'పొంచి ఉన్న ప్రమాదం.. అప్రమత్తత అవసరం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి స్పందించారు. మంగళవారం ఆయా విభాగాల అధికారులతో వెళ్లి లాలాపేటలోని పురాతన కట్టడాన్ని పరిశీలించి కట్టడంపై పెరుగుతున్న వృక్షాలతో పగుళ్లు వచ్చి కూలిపోయే ప్రమాదం ఉందని వెంటనే ఆ చెట్టును తొలగించి ప్రాచీన కట్టడం (పెద్ద దర్వాజ) పరిరక్షణకు చర్యలు తీసుకోవాలనీ ఆదేశించారు. ఈ నెల 25న ఆ నిర్మాణంపై పెరిగిన వృక్షం తొలగింపు పనులు చేపడతామని అధికారులు పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న సాక్షికి సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారి శ్రీధర్, ఏఈ రాజేష్, జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారిణి సింధుజ, ఏఈ వెంకటేష్, రాజశేఖర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీరామ్ శివకుమార్ పాల్గొన్నారు.


సాక్షి
పొంచి ఉన్న ప్రమాదం.. అప్రమత్తత అవసరం

ఈ నెల 21న ప్రచురితమైన కథనం



ప్రాచీన కట్టడాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్